క్లుప్తంగా

బూచేపల్లి శివన్నను కలిసిన పాస్టర్లు



శివన్నను సన్మానిస్తున్న పాస్టర్లు

దొనకొండ: మండల పాస్టర్ల ఫెలోషిప్ సంఘ నేతలు వైఎస్సార్ సీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డిని మంగళవారం ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను శాలువాతో సన్మానించి బోకేలు అందజేశారు. వారి సమస్యలు శివన్నకు వివరించారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ వేగవంతం చేయాలి

రాచర్ల: ఆరోగ్యశ్రీ కార్డులను వేగవంతంగా పంపిణీ చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతి అన్నారు. మండలంలోని అనుమలవీడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్య సురక్షలో భాగంగా పూర్తిగా ఆరోగ్యం క్షీణించిన వారికి మెరుగైన వైద్యం కోసం వివిధ హాస్పిటళ్లకు రిఫర్ చేయాలన్నారు. అంతేగాక ప్రభుత్వం మంజూరు చేసిన ఆరోగ్యశ్రీ కార్డులను గ్రామ వలంటీర్లతో కలిసి కార్డులు త్వరగా పంపిణీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గర్భిణులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు.వైద్యశాలల్లో సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, డాక్టర్లు సమయపాలన పాటించాలని తెలియజేశారు.డాక్టర్‌కమలాదేవి,ఫార్మసిస్టు, హెల్త్‌సూపర్‌వైజార్లు,ఆశావర్కర్లు పాల్గొన్నారు.

దుకాణాల్లో తనిఖీలు

కంభం: పట్టణంలో తూనికల కొలతల శాఖ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. కందులాపురం సెంటర్‌లోని మహాలక్ష్మి ఎలక్ట్రికల్ షాపులో తనిఖీ చేసి రెండు కేసులు, పట్టణంలో మరోచోటమూడు కేసులు నమోదు చేసినట్లు తూనికలు కొలతల శాఖ అధికారి రియాజ్‌తెలిపారు.తూనికల్లోతేడాలున్నా,నిబంధనలకువిరుద్ధంగా వ్యాపారాలునిర్వహించినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఇంటింటికీ కుళాయి

దొనకొండ: మండలంలోని గంగదేవిపల్లి ఎస్సీ కాలనీకి ఇంటింటికీ కుళాయి జల జీవన్ పథకంలో మంజూరైంది. ఈ సందర్భంగా సర్పంచ్ ఎగ్గోని కుమారి, మాజీ సర్పంచ్ కర్నాటి సునీతాంజనేయరెడ్డి మంగళవారం వాటిని ప్రారంభించారు. గ్రామానికి నీటి సదుపాయం కల్పించిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మకు, దర్శి నియోజకవర్గం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డికి ఎస్సీ కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వేతన పెంపుపై సమగ్ర శిక్ష సిబ్బంది హర్షం

పొదిలి: వేతనం పెంచడంపై సమగ్ర శిక్ష సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. సంఘ పీటీఐ యూనిటీ జిల్లా అధ్యక్షుడు షేక్.కరీముల్లా ప్రభుత్వానికి ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి 11వ పీఆర్‌సీ వర్తింపజేస్తూ 23 శాతం వేతనం పెంచడం హర్షణీయమని పేర్కొన్నారు. విద్యాశాఖలో ఏళ్ల తరబడి వర్క్, ఆర్ట్, పీఈటీలుగా పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లుగా అతి తక్కువ వేతనంతో పనిచేస్తున్న సిబ్బందికి ఊరట కలిగిందని కరీముల్లా పేర్కొన్నారు. వేతనం పెంపునకు సహకరించిన మంత్రి బొత్స సత్యనారాయణ, ఏపీ జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, యూనిటీ టీం రాష్ట్ర అధ్యక్షురాలు సైకం శివకుమారిరెడ్డి, జిల్లా ఏపీసీ వీఎస్ సుబ్బారావుకు పీటీఐ తరపున కృతజ్ఞతలు తెలిపారు.

నేడు 10వ వార్డులో వైఎస్సార్ సీపీ ప్రచారం

దర్శి: పట్టణంలోని 10వ వార్డు లంకోజనపల్లి రోడ్డులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మన ఊరికి మన శివన్న కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉదయం 7 గంటలకు ఎన్నికల ప్రచారం జరుగుతుందని కార్యాలయం ప్రతినిధి సందిరెడ్డి నరేంద్రరెడ్డి తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి తాళ్లూరు మండలం నాగంబొట్లపాలెం పంచాయతీలో ప్రచారం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, ఆయన సతీమణి బూచేపల్లి నందినీలు పాల్గొంటారని తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.

తాళ్లూరు (ముండ్లమూరు): మండలంలోని నాగంబొట్లపాలెంలో బుధవారం మన ఊరికి మన శివన్న ఎన్నికల ప్రచారం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ దర్శి నియోజకవర్గ కార్యాలయ ఇన్‌చార్జి సందిరెడ్డి నరేంద్రరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి జరిగే ఎన్నికల ప్రచార కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి, దర్శి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌ఛార్జ్, దర్శి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి, కుటుంబ సభ్యులు పాల్గొంటారని తెలిపారు. ప్రచార కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

జగనన్న ఆరోగ్య శిబిరాలు వినియోగించుకోవాలి



దొనకొండ: వైద్య శిబిరం పరిశీలిస్తున్న ఎంపీపీ



కొండాయపాలెంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు



వైద్యశిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు

దొనకొండ: పేద, సామాన్య కుటుంబాలకు గ్రామాల్లోనే మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేశారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి తెలిపారు. మంగళవారం మండలంలోని పి.వెంకటాపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి సునీత సమక్షంలో వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి రమణయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

345 మందికి ఆరోగ్య పరీక్షలు

పొదిలి రూరల్: మండలంలోని కొండాయపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష–2 వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పలపాడు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుగుణకుమార్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. 345 మందిని డాక్టర్లు శరత్ చంద్ర, శ్రీదేవి, నరసింహరావు పరీక్షించి, మందులు పంపిణీ చేశారు. సూపర్‌వైజర్ లేళ్ల శ్రీనివాసరెడ్డి, ఏఎన్‌ంలు, ఆశా కార్యకర్తలు, వలంటీర్లు గ్రామస్తులు పాల్గొన్నారు.

332 మందికి వైద్య పరీక్షలు

పెద్దదోర్నాల: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని వై.చర్లోపల్లిలో మంగళవారం రోగులకు వైద్య పరీక్షలు చేశారు. కొర్రప్రోలు ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన క్యాంపులో 332 మందికి వైద్య పరీక్షలు చేశారు. వారిలో ఒకరికి మెరుగైన వైద్యం కోసం రెఫర్ చేశారు. వైద్య శిబిరంలో డాక్టర్ ఖాదర్ రసూల్, డాక్టర్ బాలేశ్వరయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ కేసుల పరిష్కారంపై దృష్టి



తాళ్లూరు పోలీసుస్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న దర్శి సీఐ

తాళ్లూరు (ముండ్లమూరు): మండలంలో పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించేందుకు సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలని దర్శి సీఐ ఎస్‌కే షమీఉల్లా తెలిపారు. సాధారణ తనిఖీల్లో భాగంగా స్థానిక పోలీసుస్టేషన్‌ను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందితో ఆయన మాట్లాడుతూ ఎన్నికల దృష్ట్యా మండలంలో సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రాత్రి వేళల్లో గస్తీని ముమ్మరం చేయాలన్నారు. అసాంఘిక కార్యాకలాపాలకు పాల్పడే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. సిబ్బంది సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఆయన వెంట ఎస్‌ఐ వైవీ రమణయ్య, ఏఎస్‌ఐ మోహనరావు, సిబ్బంది బ్రహ్మానాయుడు, రాముడు, అంజిబాబు ఉన్నారు.

ఇండియన్ బ్యాంక్ నూతన శాఖ ప్రారంభం



బ్యాంక్‌ను ప్రారంభిస్తున్న డీజీఎం మూర్తి

పొదిలి: స్థానిక పాతూరులో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఎదురుగా ఏర్పాటు చేసిన ఇండియన్ బ్యాంకు నూతన శాఖను మంగళవారం ఫీల్డ్ జనరల్ మేనేజర్ ఎ.గణేశరామన్ హైదరాబాద్ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. శాఖను ప్రారంభించిన డిప్యూటీ జనరల్ మేనేజర్ డి.ఎస్.మూర్తి మాట్లాడుతూ.. బ్యాంకు ద్వారా అందిస్తున్న సేవల గురించి వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ జోనల్ మేనేజర్ కె.కృష్ణమోహన్, బ్రాంచ్ మేనేజర్ కటకం గోపాలరావు, ఆర్య వైశ్య సంఘ అధ్యక్షుడు జీసీ సుబ్బారావు, పాఠశాల హెచ్‌ఎం కుమార్‌రెడ్డి, పట్టణంలోని పలువురు వ్యాపారులు పాల్గొన్నారు.

105 మంది అనాథలకు పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న ఫారెస్ట్ రేంజి అధికారి విశ్వేశ్వరరావు

పెద్దదోర్నాల: నల్లమల అటవీ ప్రాంతంలో నివసించే చెంచు గిరిజనుల అభ్యున్నతికి ఆర్డీటీ అందిస్తున్న తోడ్పాటు అభినందనీయమని ఫారెస్ట్ రేంజి అధికారి విశ్వేశ్వరరావు కొనియాడారు. చిన్నగుడిపాడు ఆర్డీటీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఆర్డీటీ సంస్థ సమకూర్చిన పౌష్టికాహార పదార్థాలను 105 మంది దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, అనాథ గిరిజనులకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆర్డీటీ అందిస్తున్న తోడ్పాటును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా బియ్యం, రాగులు, గోధుమలు, నూనె, న్యూట్రిషన్ సరుకులు పంపిణీ చేశారు. ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ పుష్పలత, ఏరియా టీం టీడర్ వేమయ్య, కమ్యూనిటీ ఆర్గనైజర్ రాజారత్నం, రమణ, శ్రీనివాసులు, ఇమ్మానియల్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలి

పెద్దదోర్నాల: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యాభ్యాసం చేసి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని గురుకులాల జాయింట్ సెక్రటరీ రమణమూర్తి ఆకాంక్షించారు. మంగళవారం స్థానిక ఏకలవ్య మోడల్ పాఠశాలలో ఇంటర్, పదో తరగతి విద్యార్థులకు ఫేర్‌వెల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని పాఠశాలకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని కోరారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. డిప్యూటీ సెక్రటరీ రామ్మోహనరెడ్డి, ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శ్రీనివాసరావు, ఎంఈఓ మస్తాన్‌నాయక్, పాఠశాల ప్రిన్సిపాల్ శ్యామ్యేల్ జోబ్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్తమ అవార్డు గ్రహీతకు సన్మానం



డాక్టర్ సూరిబాబును సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని ఏరియా వైద్యశాలలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఉత్తమ అవార్డు గ్రహీత డాక్టర్ సూరిబాబును బీజేపీ నాయకులు పిడతల రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం సన్మానం చేశారు. ఈ సందర్భంగా రమేష్‌రెడ్డి మాట్లాడుతూ నాబార్డు నిధులతో నిర్మిస్తున్న వంద పడకల వైద్యశాలలో సూరిబాబు వైద్యసేవలను ప్రభుత్వం గుర్తించిందన్నారు. ఆయుష్మాన్ భారత్ కార్డుల గురించి రోగులకు వివరించడంలో సూరిబాబు శక్తివంచన లేకుండా పనిచేయడం గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ఆయుష్మాన్ అవార్డు అందజేసిందన్నారు. బీజేపీ నాయకులు గుమ్మా రాముడు, వీరచక్రం, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

కొనకనమిట్ల: విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న మౌలిక వసతులు ఉపయోగించుకుని విద్యలో ఉన్నత స్థాయికి ఎదగాలని గొట్లగట్టు కేజీబీవీ ప్రిన్సిపాల్ రాఘవ సురేఖ సూచించారు. మంగళవారం పాఠశాలలో బాలికలకు చదువు విశిష్టత, ప్రభుత్వం అందించిన ట్యాబ్‌ల నిర్వహణపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులు మంచిగా చదువుకుని ప్రయోజకులు కావాలని ఆకాంక్షించారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



ప్రమాణస్వీకారం చేస్తున్న ఎస్టీయూ నూతన కమిటీ సభ్యులు

మార్కాపురం టౌన్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎస్టీయూ అధ్యక్షుడు టీవీ రమణ తెలిపారు. మంగళవారం మార్కాపురంలో ఎస్టీయూ కార్యవర్గ సమావేశం నూతలపాటి ప్రసాదరావు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కె.ఎర్రయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి బీసీహెచ్ వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా మార్కాపురం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఎస్ఎస్ ఫిలిప్, ప్రధాన కార్యదర్శిగా ఎం హనుమంతరావు, ఆర్థిక కార్యదర్శిగా ఎస్.రవికుమార్, ఉపాధ్యక్షులుగా కె.రామకృష్ణారెడ్డి, లలిత, శ్రీను, కార్యదర్శులుగా రమేష్, అమరేశ్వరరావు తదితరులను ఎన్నుకున్నారు. జిల్లా కౌన్సిలర్లుగా ఎర్రయ్య, ప్రసాదరావు, అల్లా, హనుమంతాచారీ, బాలూనాయక్, వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా మండ్ల రామాంజనేయులు వ్యవహరించారు.

ట్రైనీ ఎస్సైకి సన్మానం



సుభాషిణిని సత్కరిస్తున్న దళిత నాయకులు

దర్శి: నూతనంగా ఎస్సైగా ఎంపికై ట్రైనింగ్‌లో ఉన్న గంగుల సుభాషిణీని దళిత మేధావుల సంఘం, దళిత సేన నాయకులు పూల మాలలతో మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా దళిత సేన నియోజకవర్గ అధ్యక్షుడు గర్నెపూడి ప్రేమ్‌కుమార్, లంకోజనపల్లి ప్రధానోపాధ్యాయుడు వేల్పుల రాఘవరావు మాట్లాడుతూ అట్టడుగు వర్గంలో కష్టపడి ఎస్సై

పేదలకు ఇళ్ల స్థలాలపై సంపూర్ణ హక్కులు

పొదిలి రూరల్: జగనన్న కాలనీల్లో ఇంటి స్థలాల యజమానులను పైసా ఖర్చు లేకుండా సంపూర్ణ హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తహసీల్దార్ ఎండీ జియా పేర్కొన్నారు. పొదిలి మండలంలోని కొండాయపాలెం సచివాలయాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేసి, రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు వేగంగా సాగుతున్నాయన్నారు. ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ వల్ల లబ్ధిదారులకు సర్వ హక్కులు సంక్రమిస్తాయని స్పష్టం చేశారు. ఇంటిని బ్యాంకులో తనఖా పెట్టి రుణసాయం పొందవచ్చని చెప్పారు. రిజిస్ట్రేషన్ ఉండటం వల్ల ఇంటి విలువ పెరిగి కొనుగోలుకు డిమాండ్ ఏర్పడుతుందన్నారు. తద్వారా అత్యవసర సమయాల్లో ఇంటిని విక్రయించేందుకూ వీలుంటుందన్నారు. వారసులకు గిఫ్ట్ డీడ్ కింద ఇంటిని బదలాయించవచ్చన్నారు. ఆయన వెంట వీఆర్వో కిలారి సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి సాయి ఉన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

కంభం: పార్టీలకతీతంగా ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలందిస్తోందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గొంగటి చెన్నారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజలు వైఎస్సార్ సీపీని వీడి తెలుగుదేశం పార్టీలోకి చేరుతున్నారంటూ ఆ పార్టీ నాయకులు ప్రచారం చేసుకుంటున్నారని, అందులో ఏ మాత్రం వాస్తవం లేదన్నారు. జనసేనా నాయకులు టీడీపీ కండువా, టీడీపీ నాయకులు జనసేనా కండువాలు వేసుకుంటూ అందరూ తమపార్టీలోకి వలసలు వస్తున్నారంటూ ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. ప్రభుత్వం అర్హతే కొలమానంగా తీసుకొని పార్టీలకు, కులమతాలకు అతీతంగా గడప వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్నప్పుడు ప్రజలకు పార్టీలు మారాల్సిన పరిస్థితి ఎందుకు వస్తుందని ప్రశ్నించారు. పార్టీ ఎవరిని ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటిస్తే వారిని మంచి మెజారిటీతో గెలిపించుకునేందుకు నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఓడి పోతామన్న భయంతోనే టీడీపీ నాయకులు తమ పార్టీలోకి ప్రజలు తరలి వస్తున్నారంటూ గొప్పలు చెప్పుకుంటోందన్నారు. మళ్లీ గిద్దలూరు నియోజకవర్గం వైఎస్సార్ సీపీ కైవసం చేసుకోవం ఖాయమన్నారు.

2025 నాటికి క్షయ నిర్మూలనే ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న డీటీసీవో డాక్టర్ సురేష్

పుల్లలచెరువు: 2025 నాటికి గ్రామాల్లో పూర్తిగా క్షయ లేకుండా నిర్మూలించడమే ధ్యేయంగా సిబ్బంది పనిచేయాలని జిల్లా క్షయవ్యాధి నియంత్రణాధికారి డాక్టర్ సురేష్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక వైద్యశాలలో ఆశ, వైద్య సిబ్బందికి క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ సురేష్ మాట్లాడుతూ గ్రామాల్లో క్షయ రోగులు లేకుండా చూడాలన్నారు. సిబ్బంది తప్పనిసరిగా క్షయ అనుమానితులు అంటే రెండు వారాలుగా దగ్గు రావడం, ఆకలి లేకుండా జ్వరం రావడం లాంటి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. గతంలో మాదిరి వైపాలెం వెళ్లకుండా పుల్లలచెరువు వైద్యశాలలోనే ఆధునిక వైద్య పరీక్షలు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి కార్యకర్త 15 మందికి వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. 2025 నాటికి డబ్ల్యూహెచ్‌ఓ ఆదేశాలపై క్షయ వ్యాధి లేకుండా నిర్మూలించడమే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. ఈ నెల 9వ తేదీన జరగనున్న డీవార్మింగ్ డే సందర్భంగా 15 సంవత్సరాల లోపు పిల్లలకు తప్పని సరిగా నులిపురుగుల నివారణ మాత్రలు మింగించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల ఆరోగ్యంపై ఆరోగ్య సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. డాక్టర్ నయాం, సీహెచ్‌ఓ బాషా పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు సాయం చేయాలి

- ఆర్‌టీఓ అమర్‌నాయక్



వాహనదారులతో మాట్లాడుతున్న ఆర్‌టీఓ అమర్‌నాయక్

కొమరోలు: రహదారి ప్రమాద బాధితులకు వాహనదారులు తప్పనిసరిగా సాయం చేయాలని మార్కాపురం ఆర్‌టీఓ అమర్‌నాయక్ తెలిపారు. మండలంలోని తాటిచెర్లమోటు వద్ద మంగళవారం రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా వాహనదారులకు అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్‌టీఓ అమర్‌నాయక్ మాట్లాడుతూ రహదారి ప్రమాదంలో గాయపడిన వారిని ప్రమాదం జరిగిన గంటలోపు వైద్యశాలలో చేర్పిస్తే మరణాల శాతం తగ్గుతుందని తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే ఆ ప్రాంతంలో సంచరిస్తున్న వారు ఎవరైనా బాధితులకు సాయం చేసి వైద్యశాలకు తరలించాలన్నారు. రహదారి ప్రమాదాల్లో సాయం చేసే వారికి రక్షణ కల్పించడానికి భారత ప్రభుత్వం నూతన చట్టం తీసుకొచ్చి ఈ చట్టప్రకారం బాధితులకు సహాయంగా వచ్చిన వ్యక్తిని ఎవరూ ప్రశ్నించకుండా బాధితులను వైద్యశాలలో చేర్చుకుంటారన్నారు. మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ మాధవరావు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన అధికారులు



తహసీల్దార్ మస్తాన్



ఎంపీడీవో విజయలక్ష్మి

రాచర్ల: స్థానిక తహసీల్దార్‌గా టి.మస్తాన్ మంగళవారం పూర్తి బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల సందర్భంగా గుంటూరు జిల్లా సత్తెనపల్లి ఆర్డీవో కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ బదిలీపై మండలానికి వచ్చినట్లు ఆయన తెలిపారు. ఎంపీడీవోగా వి.విజయలక్ష్మి పూర్తి బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల సందర్భంగా గుంటూరు జిల్లా కొల్లిపార మండలం నుంచి బదిలీపై ఆమె వచ్చినట్లు తెలిపారు.

11 లీటర్ల నాటుసారా పట్టివేత



నాటుసారా బట్టీని ధ్వంసం చేస్తున్న ఎస్సై నరసింహారావు

బేస్తవారిపేట: మండలంలోని జేబీకే పురం సమీపంలోని కొండ ప్రాంతాల్లో మంగళవారం ఎస్సై బి.నరసింహారావు నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. 200 లీటర్ల బెల్లంఊటను, నాటుసారా తయారు చేసే బట్టీలను ధ్వంసం చేశారు. నాటుసారా అమ్ముతున్న ఒకరి వద్ద 11 లీటర్లను స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. గ్రామాల్లో నాటుసారా తయారు చేస్తున్న, పేకాట ఆడుతున్న స్థావరాలపై సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచనున్నట్లు ఎస్సై తెలిపారు.

పొదిలి నూతన కమిషనర్‌గా చంద్రశేఖరరెడ్డి



కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందజేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్

పొదిలి: స్థానిక నగర పంచాయతీ కమిషనర్‌గా లింగారెడ్డి చంద్రశేఖరరెడ్డి మంగళవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెం కమిషనర్‌గా పనిచేస్తున్న ఆయన ఎన్నికల నేపథ్యంలో పొదిలికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న డానియేల్ జోషేఫ్ నెల్లూరు జిల్లాకు బదిలీ అయ్యారు. నూతన కమిషనర్‌ను శానిటరీ ఇన్‌స్పెక్టర్ మారుతీరావు, కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థినులకు శానిటరీ నాప్‌కిన్స్ పంపిణీ



విద్యార్థినులతో నిర్వాహకులు

మార్కాపురం టౌన్: విజయవాడకు చెందిన జనక్రాంతి ట్రస్టు ఆధ్వర్యంలో మార్కాపురంలోని వివిధ కళాశాలలు, పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినులకు రూ.2 లక్షల విలువైన శానిటరీ నాప్‌కిన్స్‌ను మంగళవారం నిర్వాహకులు మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు గుంటక వనజాక్షి, గోళ్ల వరలక్ష్మి, కె.విజయలక్ష్మి అందించారు. వారు మాట్లాడుతూ.. ఆరోగ్యం విషయంలో విద్యార్థినులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్ అపర్ణ, శ్రీలత, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

అండగా ఉంటా.. ఆదరించండి!

- డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి



బూచేపల్లి కుటుంబ సభ్యులకు పూలతో స్వాగతం పలుకుతున్న అభిమానులు

కురిచేడు: నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటానని, ఆదరించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి ప్రజలను కోరారు. మంగళవారం పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈద్గా ప్రహరీ, ప్లాట్‌ఫారాన్ని ప్రారంభించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, బూచేపల్లి నందినిలకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. దర్శి రోడ్డులోని శ్రీ హరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయం వద్ద పెద్ద సంఖ్యలో ప్రజలు పూలతో స్వాగతం పలికారు. శివప్రసాదరెడ్డిని చేతులపై పైకి ఎత్తి తమ అభిమానాన్ని చాటుకున్నారు. తొలుత శ్రీ హరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పంచాయతీ కార్యాలయం ఎదుట తూర్పుహరిజనవాడకు వెళ్లే దారికి రూ.5 లక్షల జెడ్పీ నిధులతో పనులు ప్రారంభించేందుకు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత పడమర హరిజనవాడ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు జరిపి ప్రజలతో మాట్లాడారు. క్రిస్టియన్‌పాలెంలో రూ.5 లక్షల జెడ్పీ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆర్యవైశ్య సంఘం, మహిళా సంఘం, ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈరన్న స్వామి దేవాలయంలో పూజలు చేసి వాల్మీకి బజార్‌లో రూ.5 లక్షలతో అంతర్గత పైపులైను నిర్మాణానికి శంకుస్థాపన, రూ.10 లక్షలతో సైడు కాలువల నిర్మాణానికి శంకుస్థాపన, అనంతరం జిల్లా పరిషత్ నిధులు రూ.15 లక్షలతో చేపట్టిన ఈద్గా ప్లాట్‌ఫారం, ప్రహరీ గోడల పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల అభిమానం, వైఎస్ జగన్‌మోహనరెడ్డి సహకారంతో మరోసారి నియోజకవర్గ ప్రజలకు సేవ చేసే భాగ్యం లభించిందన్నారు. వెంకాయమ్మ మట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహనరెడ్డిని, బూచేపల్లి శివప్రసాదరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ ఇచ్చి గుర్తింపు తెచ్చిన ఘనుడు డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి గుర్తు చేశారు. షేక్ కార్పొరేషన్ డైరెక్టర్, వైద్య విభాగం కన్వీనర్ డాక్టర్ ఎస్ఎం బాషా, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యుడు కపురం శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ బెల్లం కోటేశ్వరమ్మ, ఏఎంసీ వైస్ చైర్మన్ కండె గంగయ్య, మండల మహిళా అధ్యక్షురాలు ఇందూరి పద్మ, జేసీఎస్ కన్వీనర్ మేరువ సుబ్బారెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ వైవీ సుబ్బయ్య, పడమరనాయుడుపాలెం, కల్లూరు, కురిచేడు, బయ్యవరం సర్పంచులు బొమ్మనబోయిన మహేష్, నక్కా రామకృష్ణ, కేసనపల్లి కృష్ణయ్య, ఎం.నాగేశ్వరరావు, ఎంపీటీసీలు బుల్లం వెంకట నర్సయ్య, కానాల శివారెడ్డి, ఆవుల లక్ష్మి వెంకటరెడ్డి, హుస్సేన్, వలి, మీరావలి, షేక్ వలి, జహీర్ అహ్మద్, కరిముల్లా, యాసిన్, యూసుఫ్, నాసర్‌వలి పాల్గొన్నారు.

లైసెన్స్‌లు తప్పనిసరి

కంభం: అన్ని రకాల వ్యాపార సంస్థలు లైసెన్స్‌లు తప్పనిసరిగా తీసుకోవాలని సహాయక కార్మిక శాఖ అధికారి బాలకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ దుకాణాలు, సంస్థల చట్టం 1988 ప్రకారం ప్రతి ఒక్క దుకాణదారుడు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ కలిగి ఉండాలన్నారు. లైసెన్సుల కోసం సచివాలయాల ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని సూచించారు. ఈ నెల 29లోగా అందరూ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ పొందాలని సూచించారు.

పంటల పరిశీలన

కొమరోలు: మండలంలోని తాతిరెడ్డిపల్లె, బ్రాహ్మణపల్లి, అల్లినగరం, రెడ్డిచెర్ల, కొమరోలు గ్రామాల పరిధిలోని పంట పొలాలను గిద్దలూరు సంయుక్త వ్యవసాయ సంచాలకులు డి.బాలాజీనాయక్ మంగళవారం క్షేత్ర పరిశీలన చేశారు. రైతులు వేసిన మినుము, వేరుశనగ, పప్పుశనగ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వైరస్ నివారణ కోసం వేపనూనెతో పాటు ఇమిడాక్లోప్రిడ్ పిచికారీ చేయాలని సూచించారు. వేరుశనగలో అక్కడక్కడా మినుము, జింక్ ధాతు లోపం గమనించి వాటి నివారణ చర్యలు పాటించాలని రైతులకు తెలిపారు. మండల వ్యవసాయశాఖ అధికారి రాజశ్రీ పాల్గొన్నారు.